మీసేవలో పారదర్శకంగా సేవలు అందించాలి



మీసేవాకేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: మీసేవాకేంద్రాలు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మా వెంకట్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో ప్రభుత్వ మీసేవా కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవాలపై ఆరా తీశారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు, సవరణలపై పేదలు మీసేవా కేంద్రాల చుట్టూ తిరుగుతుండటంతో అక్కడ సమస్య తలెత్తకుండా చొరవ తీసుకున్నారు. మీ సేవా కేంద్రాలకు వచ్చే వారికి అసౌకర్యం కలగకుండా నిబంధనల ప్రకారం రూసుం వసూలు చేయాలని నిర్వాహకులకు సూచించారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



అధికారికి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్

ముషీరాబాద్: గాంధీనగర్ డివిజన్ ప్రజలు అనేక రోజులుగా తాగునీటి సరఫరాలో లోప్రెషర్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. శుక్రవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిశారు. డివిజన్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను ఆయనకు వివరించారు. లోప్రెషర్ సమస్యపై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. అయినా ఏ అధికారి స్పందించలేదని తెలిపారు. రేపు మాపు అంటూ దాటవేస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదన్నారు. సమస్య ఇప్పుడే ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందో అర్థ చేసుకోవాలన్నారు. వెంటనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు.

'రోస్టర్'లో మార్పులు చేసే వరకు పరీక్ష నిర్వహించొద్దు



అశోక్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

ముషీరాబాద్: రోస్టర్ విధానంలో మార్పులు చేసే వరకు గ్రూప్–2 ప్రధాన పరీక్షను నిర్వహించవద్దు అని కోరుతూ అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్ల పరిసర ప్రాంతాలలో ఏపీ నిరుద్యోగ అభ్యర్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోస్టర్‌లో మార్పులు చేయకపోగా రెండు రోజుల్లో ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడానికి సిద్ధమైందన్నారు. లోపాలను సరి చేయకుండా పరీక్షలు నిర్వహిస్తే భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రోస్టర్‌లో మార్పులు చేయకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రోస్టర్‌ను సరి చేసి అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు హేమంత్‌సాయి, లక్ష్మీస్వరూప, పుష్ప, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన నలుగురు విద్యార్థుల కథ సుఖాంతం

అంబర్‌పేట: పరీక్షలో కాపీ కొట్టారని టీచర్ మందలించడంతో అదృశ్యమైన నలుగురు విద్యార్థుల కథ సుఖాంతం అయ్యింది. ఈ సంఘటన అంబర్‌పేట పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎండీ అజ్మత్ అలీ, కె. తేజనాథ్‌రెడ్డి, నితీష్‌చౌదరి, హర్షవర్ధన్‌లు స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నారు. వీరు బుధవారం పాఠశాలలో జరిగిన పరీక్షకు హాజరయ్యారు. వీరు పరీక్ష సరిగా రాయకపోవడంతో టీచర్ మందలించింది. ఇంట్లో తెలిస్తే తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో పాఠశాల సమయం ముగిసాక ఇంటికి వెళ్లలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు విచారించి విద్యార్థులు యాదగిరిగుట్టలో ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి నలుగురు విద్యార్థులను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆహార భద్రత.. దరఖాస్తుల వెల్లువ!

కొత్త రేషన్‌కార్డుల కోసం సర్కిల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాలకు పోటెత్తుతున్న ప్రజలు

మన సమాజంలో రేషన్‌కార్డు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంత కాదు. ప్రతి మధ్య తరగతి కుటుంబం రేషన్ కార్డు అనేది ఉండాలని గట్టిగా నమ్ముతారు. ఏదైనా ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్‌కార్డు ఉందా అనే ప్రశ్న అధికారుల నుంచి సామాన్యుడికి ఎదరవుతోంది. ఇది కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. దీంతో ప్రజల్లో ఏదేమైన ఒక రేషన్‌కార్డు ఉండాలి. తీసి పెట్టుకుంటే అలా పడుంటది. దేనికైనా పనికొస్తదనే భావన నాటుకుపోయింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రేషన్‌కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోండని ప్రకటించడంతో ప్రజలు సర్కిల్ కార్యాలయాలు, మీసేవ కేంద్రాలకు క్యూ కడుతున్నారు.



పౌర సరఫరాల శాఖ సర్కిల్–6 కార్యాలయంలో కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

- సర్కిల్–6 కార్యాలయంలో 16వేలకు పైగా దరఖాస్తులు
- కొత్త రేషన్‌కార్డుల కోసం 5608 దరఖాస్తులు
- కార్డులో మార్పులుచేర్పుల కోసం 10186 దరఖాస్తులు
- పేర్ల తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తులు 987



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పౌరసరఫరాల శాఖ సర్కిల్–6 పరిధిలో ప్రస్తుతం 58772 ఆహార భద్రత కార్డులు (రేషన్‌కార్డులు) ఉన్నాయి. ప్రభుత్వ ప్రకటన తర్వాత 16వేలకు పైగా కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల చేసుకోవడానికి చివరి తేదీ అనేది లేకపోవడంతో ప్రజలు కాస్త అయోమయానికి గురవుతున్నారు. మళ్లీ దరఖాస్తులకు చివరి తేదీ ఇదే అని ఎప్పుడు ప్రకటిస్తారేమోననే ఆందోళనలో సర్కిల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాలకు వెళ్తున్నారు. ఈ కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు వస్తాయో తెలియకున్నా మీసేవ కేంద్రాలు దరఖాస్తుదారులతో పోటెత్తుతున్నాయి. అంతేకాకుండా బాగ్ లింగంపల్లిలోని పౌరసరఫరాల శాఖ సర్కిల్–6 కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిటలాడింది. రెండు కౌంటర్‌లు పెట్టినప్పటికీ మార్పులు చేర్పులు, కొత్త దరఖాస్తులు, పేర్ల తొలగింపు కోసం ఆ కార్యాలయం రద్దీగా మారింది.

◆ ఇప్పటి వరకు సర్కిల్–6 పరిధిలో 56974 తెల్లరేషన్‌కార్డులు, 1780 అంత్యోదయ కార్డులు, 18 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. అయితే ఇప్పుడు 16వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో కొత్త రేషనేకార్డుల కోసం 5608 దరఖాస్తులు, మార్పులుచేర్పుల కోసం 10186 దరఖాస్తులు, పేర్ల తొలగింపు కోసం 987 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. అయితే ఈ కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు



రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు మీసేవాలో చేయాలి. దరఖాస్తులకు ఎన్నిరోజులు, ఎన్ని నెలలు అనేది సమయం లేదు. కొత్త రేషన్‌కార్డులతో పాటు మార్పులు, చేర్పులకు సంబంధించిన కార్డులు ఎప్పుడు ఇచ్చేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఇంకా మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దరఖాస్తులు కోకొల్లలుగా వచ్చాయి. ఇంకా విచారణ చేపట్టలేదు. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే దరఖాస్తుల స్వీకరణను నిలిపివేసి విచారణ చేపడుతాం.

– డి. దీప్తి, సర్కిల్–6 ఏఎస్‌వో

కొత్త కార్డు కోసం దరఖాస్తు చేశా



గతంలో ఉన్న రేషన్‌కార్డు అనివార్యకారణాల వల్ల రద్దయ్యింది. రేషన్ దుకాణానికి వెళ్తే నా కార్డు రద్దయ్యిందని డీలర్ చెప్పాడు. అందు కోసం మళ్లీ కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చింది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. ఎప్పుడూ కొత్త రేషన్‌కార్డు వస్తదో తెలియని పరిస్థితి.

– మహ్మద్ ఫయాజ్, అంబర్‌పేట

పేరు తొలగింపు కోసం దరఖాస్తు చేశాం



నాకు వివాహం అయ్యింది. భర్త ఇద్దరు పిల్లలతో ఉంటున్నాను. అందుకే మా అమ్మనాన్నల రేషన్‌కార్డులో ఉన్న పేరును తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నా. పేరు తొలగించిన వెంటనే మళ్లీ విడిగా కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేస్తా. ఇప్పుడే కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేస్తే కంప్యూటర్ తీసుకోవటం లేదు. అందుకే పేరు తొలగించాలని కోరాను.

– దీపిక, అంబర్‌పేట

'వీరి పాటల్లో పదాల ఉచ్చారణ బాగుండేది'

'పాటకు పట్టాభిషేకం'లో వంశీరామరాజు



గాయకులకు జ్ఞాపికలు అందజేస్తున్న వంశీ రామరాజు తదితరులు

ముషీరాబాద్: విఖ్యాత గాయకులు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తమ పాటలతో తెలుగు భాషకే వన్నె తెచ్చారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. వారి పాటల్లో మాధుర్యం మాత్రమే కాకుండా పదాల ఉచ్చారణ బాగుండేదని అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా వీరి పాటలు ఎంపిక చేసుకోవడం సముచితంగా ఉందన్నారు. త్యాగరాయ గానసభలో ప్రముఖ గాయకుడు దాసరి శ్రీహరి సారథ్యంలో 'పాటకు పట్టాభిషేకం'కార్యక్రమం నిర్వహించారు. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం సినీ గీతాలను గాయకులు వైఎస్ రామకృష్ణ, సురేఖ మధురంగా ఆలపించారు. అనంతరం గాయకులను వంశీ రామరాజు సత్కరించారు. సాంస్కృతిక కార్యకమాలు నిర్వహించే వారికి వంశీ సంస్థల సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సుధమయి, సుంకరపల్లి శైలజ, లలిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణన రీ-సర్వేను సద్వినియోగం చేసుకోండి

టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్

నల్లకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ జనగణనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్‌చైర్మన్ కట్టెల సుభాష్ ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాల వల్ల వివరాలు ఇవ్వని వాళ్లు మాత్రమే ఈ సర్వేను వినియోగించుకోవాలని కోరారు. దీని కోసం రీ–సర్వేను ఈనెల 28వ తేదీ వరకు పొడిగించిందన్నారు.

◆ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ 040–21111111 ఏర్పాటు చేసిందని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సెంటర్ పని చేస్తుందన్నారు. ఇప్పటి వరకు సర్వేలో నమోదు కాని కుటుంబం తరపున కుటుంబ పెద్ద లేదా కుటుంబంలోని ఒకరు మాత్రమే కాల్ సెంటర్‌కు కాల్‌చేసి వివరాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ అడ్రస్‌తో పాటుగా పోస్టల్ పిన్ కోడ్ నెంబర్‌ను తెలియజేయాలని సూచించారు.

◆ ఆ వివరాల ద్వారా డేటా బేస్‌తో సరిచూసుకొని సదరు కుటుంబం సర్వేలో పాల్గొనలేదని నిర్ధారించుకొని కాల్ సెంటర్ సిబ్బంది స్థానిక ఎన్యూమరేటర్లకు సమాచారం ఇస్తారని తెలిపారు. వారు ఇంటికి వెళ్లి సర్వే వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఇంతకు ముందు ర్వేలో పాల్గొనని వారు నేరుగా ప్రజా పాలన సేవా కేంద్రాల్లో అక్కడి సిబ్బంది వివరాలనే సేకరించి సర్వేలో పేర్లు నమోదు చేస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా సర్వే ఫారం డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కులగణన రీ-సర్వేపై అవగాహన పెంచాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: సమగ్ర కులగణన రీ–సర్వేపై ప్రభుత్వం విస్తృతమైన ప్రచారంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కులగణన రీ–సర్వేకు సరైన అవగాహన కల్పించకపోవడంతో ప్రజల నుంచి స్పందన కరువైందన్నారు. నాలుగు రోజులుగా నమోదవుతున్న వివరాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం వెంటనే పత్రికలు, టెలివిజన్, రేడియో, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. కొన్ని ప్రాంతాలలో సర్వే పూర్తిగా నిర్వహించలేదని పేర్కొన్నారు. సంపూర్ణ డేటా లేకుండా నిజమైన స్థితిని అంచనా వేయలేమని అన్నారు.

హారన్, సైరన్ పెట్టుకుంటే చలాన్

నిబంధనలను బేఖాతరు చేస్తే కఠిన చర్యలు: ఏసీపీ సంపత్‌కుమార్



అంబర్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా హారన్లు వాడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ జోన్ ఏసీపీ సంపత్ కుమార్ తెలిపారు. శుక్రవారం అంబర్‌పేట, కాచిగూడ ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా విచిత్ర హారన్‌లు, అనుమతి లేకుండా వీఐపీ హారన్‌లు వాడుతున్న వాహనాలపై కొరడా ఝులిపించారు. అంబులెన్స్ ఫైర్ ఇంజిన్, పోలీస్, అనుమతి ఉన్న వీఐపీ వాహనాలు మినహా ఇతరులు సైరన్‌లు ఏర్పాటు చేసుకుంటే భారీ జరిమానాలు విధిస్తామని ఏసీపీ హెచ్చరించారు. ప్రత్యేక డ్రైవ్‌లో వాహనాలను గుర్తించి అప్పటికప్పుడు వాటిని తొలగింపజేశారు. బ్లాక్ ఫిల్మ్, విచిత్ర హారన్‌లు, బుల్లెట్ వాహనానికి సైలెన్సర్ మార్పు వంటి చర్యలకు పాల్పడితే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. వాహనదారులందరూ నిబంధనలు పాటించి ఇతరులకు సహకరించాలని కోరారు.

ఉజ్వలమైన చరిత్రకు బాటలు వేసింది ఆర్‌ఎస్‌యూయే..



ఆర్‌ఎస్‌యూ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న విరసం నేత పాణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉజ్వలమైన చరిత్రకు బాటలు వేసింది రాడికల్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) అని విరసం రాష్ట్ర నాయకుడు పాణి అన్నారు. ఈనాడు ఆర్‌ఎస్‌యూ మనకు కనిపించకపోవచ్చు కానీ దాని ప్రభావం అది అందించిన చైతన్యం వర్తమానాన్ని నడిపిస్తోందని అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్‌ఎస్‌యూయ 50 ఏళ్ల విద్యార్థి ప్రస్థానం ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేగుచుక్కలు, విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం – అనుభవాలు అనే పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం పాణి మాట్లాడుతూ.. నడుస్తున్న చరిత్రను భవిష్యత్‌ను ఎలా నిర్మించుకోవాలో ఆర్‌ఎస్‌యూ మనకు నేర్పిందన్నారు. ముఖ్యంగా మేధో, కళ, సాంస్కృతిక రంగాలపై ఆర్‌ఎస్‌యూ ప్రభావం ఎంతగానో ఉందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయాలను భావజాల సంఘర్షణ కేంద్రాలుగా మలచిందని తెలిపారు. సందర్భంగా అరుణోదయ సంస్కృతిక సమాఖ్య వారు ఆలపించిన పలు గీతాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, రామయ్య, ఏకే ప్రభాకర్, జ్యోతి, జయ, రాజశేఖర్, సహజ, నందకుమార్, డాక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆటో డ్రైవర్ల సంఘాలతో రవాణాశాఖ మంత్రి చర్చలు సఫలం



నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మాట్లాడుతున్న జేఏసీ నేతలు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నేతలతో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ కోదండరాం సమక్షంలో ఆటో సంఘాల జేఏసీ నేతలు జరిపిన చర్చలు సఫలమయ్యాయని జేఏసీ నేతలు తెలిపారు. శుక్రవారం నారాయణగూడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి మంత్రి చొరవ చూపడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12వేలను వెసులు బాటు ప్రకారం చెల్లిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

ప్రభుత్వమే ప్రత్యేక యాప్ తీసుకొస్తుందని హామీ...

ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను తీసుకురావడానికి కృషి చేస్తుందని మంత్రి తెలిపారని వారు పేర్కొన్నారు. అక్రమంగా నడుస్తున్న ఓలా, ఊబర్, రాపిడో టూవీలర్ల విషయంలో అధికారులను సంప్రదించి ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు వెంకటేశం, వీఎస్ బోసు, వి.ప్రవీణ్ , వి.మారయ్య, పి.శ్రీకాంత్, ఎంఎ సలీం, ఎ.సత్తిరెడ్డి, పి.రాంరెడ్డి, సీహెచ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిండైన భావ వ్యక్తీకరణ మాతృభాషతోనే సాధ్యం



కేశవ మెమోరియల్‌లో జరిగిన మాతృభాషా దినోత్సవంలో డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి

కాచిగూడ: నిండైన భావ వ్యక్తీకరణ మాతృభాషతోనే సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. నడుస్తున్న వ్యవస్థలో పరభాష అవసరమైన మాతృభాషను ఉదాసీనతకు గురిచేయడం సరికాదన్నారు. పాలకుల నిర్లక్ష్యంతోనే తల్లిభాష మనుగడ కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం మాజీ అధ్యక్షుడు డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ ఏర్పాటుకు గల కారణాలను, మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. మాతృభాషలో ప్రావీణ్యత సాధిస్తే ఇతర భాషలను సులువుగా ఆకలింపు చేసుకోవచ్చని అన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ తమ మాతృభాషల్లో ప్రసంగించారు. డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి ఊటుకూరు కళింది, కేశవ స్మారక విద్యాసంస్థల డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, అభిషేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రానిది 'కార్పొరేట్ కా సాత్.. కార్పొరేట్ కా వికాస్'

- సీపీఐ(ఎంఎల్) కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు కేజీ రాంచందర్
- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో 28న ఢిల్లీలో ఆల్ ఇండియా సదస్సు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేజీ రాంచందర్ తదితరులు

ముషీరాబాద్: ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ 'ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద'విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28వ తేదీన ఢిల్లీలో ఆల్ ఇండియా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు కేజీ రాంచందర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రమా, ఎస్ఎల్ పద్మ, ఎం.అన్మేష్ తెలిపారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన 'సబ్ కే సాత్.. సబ్ కా వికాస్'ఇప్పుడు 'కార్పొరేట్ కా సాత్... కార్పొరేట్ కా వికాస్'గా మారిపోయిందని ఎద్దేవ చేశారు. ఈ పదేళ్ల కాలంలో జనవరి 31న విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం కంపెనీల లాభాలు 1.5 సంవత్సరాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయని అయితే నిజ వేతనాల్లో పెంపు లేదన్నారు. కార్పొరేట్ లాభాలు మాత్రం 22 శాతం పెరిగాయని అన్నారు. ఉపాధి 1.5 శాతం మాత్రమే పెరిగిందన్నారు. 4వేల కంపెనీల ఆదాయం 6శాతం పెరిగిందని అన్నారు. అంటే ప్రధాని మోదీ అభివృద్ధి కేవలం సంపన్నులకే పరిమితమయ్యిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 28న జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



జితేందర్ దేశ్వాని(ఫైల్)

ముషీరాబాద్: ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. దోమలగూడ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... దోమలగూడలో నివాసం ఉండే జితేందర్ దేశ్వాని(53) ప్రైవేట్ ఉద్యోగి. ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమయ్యాడు. జితేందర్ దేశ్వాని కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎంత వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నం.9849563715లో సమాచారం అందించాలని కోరారు.

కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు శ్రీకాంత్, నాగరాజు

ముషీరాబాద్: విద్యార్థుల చావులకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని పీడీఎస్‌యూరాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మంలోని ఓ కార్పొరేట్ కళాశాలలో యోగా నందిని అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ ఆత్మహత్యకు కారకులైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థలు.. ఆత్మహత్యలకు నిలయాలు

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారాయని అన్నారు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కావడం లేదని వాపోయారు. ఈ ఆత్మహత్యలపైన మాట్లాడలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉండటం బాధాకరమని అన్నారు. తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల మరణాలపైన హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మహస్త్రష్, భువనగిరి మధు, డి.శ్రీకాంత్, జె.రాజేశ్వర్, మంద నవీన్, సంతోష్, జే.తిరుపతి, జి.మస్తాన్, డి.ప్రణయ్, కె.శ్రీనివాస్, గుర్రం అజయ్ తదితరులు పాల్గొన్నారు.